క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసే యువకులు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన యువకులు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ బాలాజీరావు, మండల అధ్యక్షుడు ప్రేమ్‌చందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, మైలారం నారాయణ, గుడుగుల సతీశ్ ఉన్నారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట



సుద్దాల నుంచి సుగ్లాంపల్లికి వెళ్లే రోడ్డు ఇదే

సుల్తానాబాద్: మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రైతు సమన్వయ సంఘం జిల్లా అధ్యక్షుడు కోసర్ల అనంతరెడ్డి అన్నారు. రోడ్లు భవనాల శాఖ నుంచి సుద్దాల నుంచి సుగ్లాంపల్లి రెండు కిలోమీటర్ల దూరం వరకు ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం రూ.1.75కోట్లు మంజూరు చేయడంతో రోడ్డును పరిశీలించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేశారని కొనియాడారు. నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ కాసర్ల అంజలి నాయకులు బొంకూరి ఐలయ్య, స్వరూప, సదయ్య, శ్రీనివాస్, రాంచందర్, విష్ణు, మల్లయ్య, సంపత్ పాల్గొన్నారు.

తబితా ఆశ్రమంలో అన్నదానం



చిన్నారులకు అన్నదానం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన తూళ్ల శిక్షిత్(23) 2వ తేదీన హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా శిక్షిత్ జ్ఞాపకార్థం తూళ్ల రాజేశ్-లక్ష్మి దంపతులు పట్టణంలోని తబితా ఆశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు.

అందరూ మొక్కలు నాటాలి

సుల్తానాబాద్: పరిశ్రమల నుంచి వెదజల్లే కాలుష్యాన్ని నివారించేందుకు అందరూ మొక్కలు నాటాలని మున్సిపల్ కౌన్సిలర్ ఊట్ల వర ప్రదీప్ కోరారు. మున్సిపల్ పరిధి సుభాష్ నగర్‌లో బుధవారం ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. ఫీల్డ్‌అసిస్టెంట్ కుమార్, ప్రత్యేక అధికారులు ఉన్నారు.

హోంగార్డుకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఏసీపీ, సీఐ

గోదావరిఖని: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, ఆర్థిక పరిస్థితితో మందులు కొనలేని స్థితిలో ఉన్న హోంగార్డు సంజీవ్ కుటుంబానికి మేమున్నామంటూ ఆర్థికసాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సంజీవ్ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, సీఐ ప్రవీణ్‌కుమార్ తెలుసుకుని జమ చేసిన రూ.13,100 బుధవారం అందించారు. పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్సై ఉదయ్ కిరణ్, ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, మల్లేశం, హెడ్‌కానిస్టేబుల్ బాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టండి

మంథని: గంజాయి రవాణాను నియంత్రించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం మంథని సీఐ సతీశ్‌కు వినతి పత్రం అందించినట్లు పేర్కొన్నారు. గంజాయి రవాణా ద్వారా అనేక మంది యువత తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని బీజేవైఎం పట్టణ శాఖ అధ్యక్షుడు బుర్ర రాజు అన్నారు. మంథని ప్రాంతంలో గంజాయికి అలవాటు పడి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. నాయకులు ఎడ్ల సాగర్, శ్రావణ్, గురువేష్, పార్వతి విష్ణు, ప్రసాద్ ఉన్నారు.

ప్రభావిత గ్రామాలు.. అభివృద్ధికి దూరం

- ప్రధాన రోడ్లన్నీ గుంతలమయం
- మౌలిక వసతులు కల్పించాలని స్థానికుల విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు



ఆర్ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామంలో గుంతలమయంగా రోడ్డు

ఫెర్టిలైజర్‌సిటీ: 'పరిశ్రమలు వస్తే ప్రభావిత గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పంట పొలాలు, ఇళ్ల స్థలాలు ఇచ్చాం. పరిశ్రమలు వచ్చినా.. ప్రభావిత గ్రామాలు అభివృద్ధి చెందడం లేదు' అని గ్రామస్తులు వాపోతున్నారు. లక్ష్మీపురం, వీర్లపల్లి, న్యూమారేడుపాక రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ప్రభావిత గ్రామాలు. గ్రామంలో మౌలిక వసతులు తాగునీరు, సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం కల్పించాలి. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ ప్రారంభ సమయంలో 2015 మార్చి 11న ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు వీర్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో కర్మాగారంలో ఉత్పత్తి మొదలుకాగానే ప్రభావిత గ్రామాల్లో అభివద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చిన అధికారులు ప్రస్తుతం ఉత్పత్తి ప్రారంభించి రెండేళ్లు గడిచినా.. ప్రభావిత గ్రామాలను పట్టించుకోవడం లేదని ప్రభావిత గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ ప్రభావిత గ్రామాల్లో అభివద్ధికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది.

పట్టించుకోని యాజమాన్యాలు

రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో మొదటిసారిగా లాభాలు ప్రకటించారు. 2023–24లో మొదటి మూడు నెలల్లో రూ.86.52 కోట్లు సంపాదించుకుందని అధికారులు ప్రకటించారు. రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో ఉత్పత్తి, రవాణా, ఆదాయం బాటలో ఉన్న కర్మాగారం ప్రభావిత గ్రామాల్లో మౌలిక వసతులు రోడ్లు, తాగునీటి సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వీధిదీపాలు ఏర్పాటుకు నిధులు కేటాయించలేదు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి..

ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రభావిత గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. నిధులను కార్పొరేషన్‌కు కేటాయించడంతో ప్రభావిత గ్రామాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో నిధులు ఉపయోగిస్తూ ప్రభావిత గ్రామాలకు మొండిచేయి చూపుతున్నారు. ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసం యాజమాన్యాలు, అధికారులు స్పందించి అభివృద్ధికి నిధులను నేరుగా గ్రామాలకే కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మించాలి



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నిర్మాణ క్రమంలో లక్ష్మీపురం కొత్త గేట్ నుంచి వీర్లపల్లి మీదుగా వెళ్లే ప్రధాన రహదారి ప్లాంట్ నిర్మాణ క్రమంలో భారీ యంత్రాలు, కర్మాగార సామగ్రిని ప్లాంటుకు చేర్చే క్రమంలో భారీ వాహనాలు నడపడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి. **– నేరెళ్ల ఆశ, లక్ష్మీపురం**

కాలుష్యంతో అనారోగ్యం



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నుంచి వెలువడే కాలుష్యంతో ప్రభావిత ప్రాంతాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి ప్రభావిత గ్రామాల్లో ప్రతినెలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేయాలి. **– తాటికొండ రాజబాబు, లక్ష్మీపురం**

నిధులు కేటాయిస్తే అభివృద్ధి



ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రభావిత గ్రామాలకు నేరుగా నిధులు కేటాయిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. అలాకాకుండా కార్పొరేషన్ నిధులు కేటాయించడంతో ప్రభావిత గ్రామాల్లో తక్కువ మొత్తంలో నిధులు కేటాయించి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. యాజమాన్యాలు ప్రభావిత గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించాలి. **– మాధవరావు, లక్ష్మీపురం**

పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో సీనియర్ కాంగ్రెస్ నేతలు తోట వేణు, సమ్మెట స్వప్న, మాజీ కౌన్సిలర్ తోట అనసూయ, శనిగరపు శారద, అడ్డూరి రాణితో పాటు 400 మంది మహిళలు బీఆర్ఎస్‌లో చేరిన క్రమంలో వారికి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, సాగంటి శంకర్, నాయకులు తోడేటి శంకర్‌గౌడ్, మెతుకు దేవరాజ్, పిల్లి రమేశ్, తోకల రమేశ్, రమ్య యాదవ్, చిట్టవేణి వేణు, గాదె శంకర్, పిల్లి రాజయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యుత్ సమస్యలు దూరం

రామగుండం: గ్రామాల్లో లో వోల్టేజీ సమస్యతో గృహోపకరణాలు దగ్ధం కావడంతో సాధారణ మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోతుండడంతో పాటు విద్యుత్ ఆధారిత చిరు వ్యాపారులు సైతం ఉపాధి కోల్పోతుండడం, వేలాడే విద్యుత్ తీగలతో ప్రమాదాలు పొంచి ఉండడం తదితర సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే బీఆర్ఎస్ లక్ష్యమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం అంతర్గాం మండల పరిధిలోని రాయదండి, గోలివాడ, బ్రాహ్మణపల్లి, సోమనపల్లి, ఎగ్లాస్‌పూర్, విసంపేట గ్రామాల్లో రూ.3.60లక్షలతో నూతన విద్యుత్ లైన్లు, వేలాడే విద్యుత్ తీగలను సవరించేందుకు అదనపు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. రైతులకు, గృహాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, సర్పంచులు ధర్మాజి కృష్ణ, ధర్ని రాజేశ్, ప్రవీణ్‌కుమార్, సత్య, గంగారపు దేవమ్మ, అనిత ఉన్నారు.

విజేతలకు అభినందన



అభినందిస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ట్రినిటి హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచిన హర్షిత, అక్షయ, సంకీర్తన, సయిదా, అక్షర, రక్షిత, నేత్రను మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అభినందించారు.

సమ్మెకు దిగిన రెండో ఏఎన్ఎంలు



సమ్మె చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

పెద్దపల్లిరూరల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు బుధవారం నుంచి సమ్మెకు దిగారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వరూప, నాయకులు సునీత, రాజేశ్వరి, నిర్మల, రమ, అరుణ, సుజాత పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుడికి సన్మానం



శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

జ్యోతినగర్: ఏఐటీయూసీ అనుబంధ ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మహాదేవుని శంకర్‌ను బుధవారం సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా మేడిపల్లి సెంటర్ సాయి సేవాసమితిలో ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ.గౌస్, ఏఐటీయూసీ ఆర్జీ వన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు శనగల శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు రాజబాబు, రమేశ్‌కుమార్, ఇజ్జగిరి భూమయ్య, వెంకటస్వామి, సుదర్శన్, లెనిన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు, సివిల్‌సప్లయి అధికారులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు అక్రమంగా నిల్వ ఉంచిన ప్రాంతానికి చేరుకుని 53 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించినట్లు బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ సీపీఐ ఆమరణ నిరాహార దీక్ష విరమణ

ఓదెల: ఓదెలలో దళితబంధు పథకం అర్హులైన వారందరికీ ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ఆమరణ దీక్షను మంగళవారం సాయంత్రం విరమించారు. ఆమరణ దీక్ష చేపట్టిన స్వామి, సూత్రాల స్వామి, రాకేశ్ పొత్కపల్లి పోలీసుల ఆదేశాలతో విరమించారు.

✦ వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనూర్, గోపరపల్లె, నాంసానిపల్లె గ్రామాల్లో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల నుంచి సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ వైపులకు వెళ్లే అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

✦ ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లికి చెందిన గంట కొమురయ్య (40) అనే వ్యక్తి ఎత్తైన గుట్ట ప్రాంతం నుంచి జారి కింద పడి బుధవారం మరణించాడు. బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం కొమురయ్య మేకలకు అవసరమైన మేతను తెచ్చేందుకు గ్రామ సమీపంలోని గుట్టకు వెళ్లాడు. చెట్టు కొమ్మలను కోసే క్రమంలో జారిపడడంతో గాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరేలోపే కొమురయ్య కన్నుమూశాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

✦ ఉచితంగా డయాబెటిక్ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని కమాన్‌ప్రాంతంలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా డయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 111 మందికి పరీక్షలు చేసినట్లు క్లబ్ ప్రతినిధులు సాదుల వెంకటేశ్వర్లు తెలిపారు. క్లబ్ సభ్యులు రమేశ్, సత్యనారాయణ, రాంరెడ్డి, కుమారస్వామి, సాబిర్ ఖాన్ ఉన్నారు.

✦ విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షుడిగా సంపత్

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘ ఉపాధ్యక్షుడిగా గర్రెపల్లికి చెందిన గర్రెపల్లి సంపత్‌ను ఎన్నుకున్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం సంపత్‌ను కుల సంఘం నాయకులు సన్మానించారు. నరసింహాచారి, గర్రెపల్లి శంకరయ్య, భాస్కరాచారి, సుదర్శన్, వినయ్ ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఎలిగేడు: వానాకాలం సీజన్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయించాలని మండల పశువైద్యాధికారి ఝాన్సీ సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నారాయణపల్లిలో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. గ్రామంలోని 152 ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకా వేసినట్లు ఆమె వెల్లడించారు. సర్పంచ్ మాడ కొండాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ సబ్బు శ్రీధర్, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్

పెద్దపల్లిరూరల్: కళాశాలల్లో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు స్నేహపూర్వకంగా మెదలాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ అనిల్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం కమ్యూనిటీ పోలీసింగ్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మహేందర్‌తో కలిసి పాల్గొన్నారు.

గిరిజన తండాలకు కాంగ్రెస్ కన్నతల్లి



స్వాగతం పలుకుతున్న తండావాసులు

ఓదెల: గిరిజన తండాలకు కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిదని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పేర్కొన్నారు. బుధవారం ఓదెల మండలం లంబాడితండాలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తండాలు, గిరిజన ప్రాంతాలు ఎలాంటి అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని విమర్శించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోతు నిమ్మనాయక్, నాయకులు రాజేశం, లింగేష్, సీతారాం, నాగేశ్, భాస్కర్, కంకణాల భాస్కర్‌రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యం



ర్యాలీలో పాల్గొన్న దాసరి ఉష

ఓదెల: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యమని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆరోపించారు. ఓదెల మండలం గుంపుల గ్రామంలో బుధవారం మన ఊరు మన ఉష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే బహుజన రాజ్యంలో పేదోడికి అన్ని పథకాలు వర్తిస్తాయని అన్నారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఇంటింటా తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, జిల్లా మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్నగౌడ్, ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్, కోశాధికారి ఎండీ రియాజ్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో చకచకా అభివృద్ధి పనులు



కొనసాగుతున్న నిర్మాణ పనులు

ఓదెల: మల్లికార్జునస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు చకచకా కొనసాగుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దాతల సాయంతో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నారు. శిథిలావస్థకు చేరిన గెస్ట్‌హౌజ్‌ను కూల్చివేసి తిరిగి నిర్మిస్తున్నారు. దీనికి కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ జిన్నా శ్రీనివాస్‌రెడ్డి రూ.30లక్షలు అందించారు. అదనపు గదులతోపాటు అతిథి గృహం అందుబాటులోకి రానుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బందెలదొడ్డి, నైట్‌షెల్టర్ భవనం ఆక్రమణపై విచారణ



విచారణ జరుపుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో బందెలదొడ్డి, నైట్ షెల్టర్ భవనం ఆక్రమణకు గురైనట్లు ఇటీవల ఏఐవైఎఫ్ నాయకులు ఫిర్యాదు చేశారు. కాగా కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి తిరుపతమ్మ విచారణ జరిపారు. గతంలో బందెలదొడ్డి ఉన్న స్థలంలో ప్రస్తుతం ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్న తీరుపై వివరాలు సేకరించారు. అలాగే నైట్‌షెల్టర్ కోసం ఆధునీకరించిన భవనాన్ని కూడా ఇతరులు అక్రమంగా ఆక్రమించుకొని వాడుకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భవనాన్ని కూడా పరిశీలించారు. నివేదికను మున్సిపల్ కమిషనర్‌కు సమర్పిస్తామని టౌన్ ప్లానింగ్ అధికారి వెల్లడించినట్లు ఏఐవైఎస్ నాయకులు తెలిపారు. ఏఐవైఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపూరి సూర్య, నగర్ కార్యదర్శి ఆశాల నవీన్, శనిగరపు చంద్రశేఖర్, రేణికుంట్ల ప్రీతమ్, రనవేని సుధీర్ కుమార్ ఉన్నారు.

తెనుగుపల్లెలో మెడికల్ క్యాంప్



మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామపంచాయతీ పరిధిలోని తెనుగుపల్లెలో బుధవారం మేడారం పీహెచ్‌సీ వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో శానిటేషన్‌తో పాటు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది 116 మందికి స్క్రీనింగ్ చేశారు. ఇందులో 28 మంది నుంచి రక్తన మూనాలు సేకరించి 70 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. 24 మంది నుంచి మలేరియా శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇటీవల జ్వరంతో మరణించిన కుటుంబ సభ్యులను ఎంపీడీవో జయశీల పరామర్శించారు. పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ గౌతం, మలేరియా మండల నోడల్ పర్సన్ అట్ల దామోదర్‌రెడ్డి, సూపర్‌వైజర్ జీవరాణి, ల్యాబ్ టెక్నీషియన్ రమేశ్, కార్యదర్శి ముజీవుద్దీన్ పాల్గొన్నారు.

దీప దూప నైవేద్య అర్చకుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక

సుల్తానాబాద్: దీప దూప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉద్దండ నవీన్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి హాజరైన అర్చకులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఊటూరి శ్రవణ్‌కుమార్ ఆచార్య, పారువెల్లి సంతోష్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా కాందూరి వాసు, కార్యదర్శిగా శ్రీరామోజురవితేజ, సంయుక్త కార్యదర్శిగా చెరుకుపల్లి వెంకటేశ్వరశర్మ, కోశాధికారిగా గజవెల్లి విశ్వనాథం, బండవరపు రామాంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా కాందూరి దామోదరచార్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కాందూరి వాసును పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సన్మానించారు.

మాజీ ప్రధానికి నివాళి



నివాళి అర్పిస్తున్న సునీల్‌రెడ్డి

మంథని: భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి బుధవారం మంథనిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్, కోకన్వీనర్ నాంపల్లి రమేశ్, జిల్లా అధికార ప్రతినిధి పోతరవేన క్రాంతికుమార్, పట్టణశాఖ అధ్యక్షుడు బూడిద తిరుపతి ఉన్నారు.

పెద్దపల్లిరూరల్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి బుధవారం పెద్దపల్లిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు నివాళి అర్పించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన బర్పటి చిన్నలచ్చయ్య ఫోన్ ఎల్లంపల్లి గ్రామానికి వెళ్లే క్రమంలో కిందపడిపోయింది. ఈ నేపథ్యంలో చిన్నలచ్చయ్య అంతర్గాం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బుధవారం బాధితుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ సెల్‌ఫోన్ అప్పగించారు.